సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 3 । ఆగస్టు । 2023



నేటి నుంచి బ్యాడ్మింటన్ సంబరం

కడపలో ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. -8లో..



వాస్తవం ఉన్న వార్తలకే విలువ

వార్తలు వాస్తవాలను ప్రతిబింబింపజేసేలా ఉండాలని అప్పుడే ప్రజలకు మీడియాపై నమ్మకం విలువ ఉంటుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1580	రూ.1840
రెండోరకం	రూ.1200	రూ.1560



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	262	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 345.64 కిలోలు

న్యూస్‌రీల్

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

మదనపల్లె సిటీ: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్‌హుస్సేన్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 2 నుంచి 17వ వరకు ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కనీస విద్యార్హత 10వతరగతి పాసై ఉండాలన్నారు.40 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన స్త్రీ,పురుషులు మైనార్టీలు, ఇతర కులాలు అర్హులన్నారు. ఇందులో మైనార్టీలకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9966319199, 996613 6600కు ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తారన్నారు.

మేలు జాతి దూడల ప్రదర్శన



రైతుకు బహుమతి అందజేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి శారదమ్మ

సిద్దవటం: జాతీయ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిద్దవటం వంతాటిపల్లె గ్రామంలో బుధవారం ఉత్తమ మేలుజాతి పెయ్య దూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీకృత పశుదాణా ఉపయోగించడం వల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. కడప ఉప సంచాలకులు టి.వి. రమణయ్య మాట్లాడుతూ వర్షా కాలంలో పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి తెలియజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, సిద్దవటం సహాయ సంచాలకులు డాక్టర్ లక్ష్మీదేవి మాట్లాడారు. అనంతరం మేలు జాతి పెయ్యదూడల రైతులకు బహుమతులును అందజేశారు. కార్యక్రమంలో డిఎల్‌డిఏ చైర్మన్ మాధవరెడ్డి, డాక్టర్ శివరామిరెడ్డి, మాచుపల్లె డాక్టర్ స్వేత, భాకరాపేట డాక్టర్ శివశంకర్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ టమాటాల రాక

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తున్న టమాటాలు గురువారం కడప రైతు బజార్‌కు వస్తున్నట్లు మేనేజర్ నాయక్ తెలిపారు. రెండు టన్నుల టమాటాలను ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. టమాటాల కోసం వచ్చే వినియోగదారులు తప్పని సరిగా ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలన్నారు.

ఇక ప్రత్యామ్నాయమే!

- 23 మండలాల్లో అమలుకు ప్రణాళిక
- 45,980 హెక్టార్లలో ఉలవల సాగు
- 11,495 క్వింటాళ్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదన
- ఇప్పటికే రాగి, కందులు పంపిణీ
- జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 25.78 శాతమే



	సాగు లక్ష్యం	సాగైంది
అన్నిపంటలు	82,589	21,292
వేరుశెనగ	47,885	12,724
2022 ఖరీఫ్		
అన్నిపంటలు	86,795	33,735
వేరుశేనగ	55,111	24,424

(హెక్టార్లలో)

వర్షపాతం-2023

నెల	సగటు	కురిసింది	లోటు (మి.మీ)
జూన్	75.1	39.4	47.5
జూలై	90.5	63.4	29.9

బి.కొత్తకోట: జిల్లాలో ఖరీఫ్ రైతాంగానికి వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. అల్పపీడనంతో కుండపోత వర్షాలు కురుస్తుంటే జిల్లా రైతులు చినుకు కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. జూలై 15తో ఖరీఫ్ పంటల సాగుకు అదును ముగిసిపోయింది. నెల కూడా గడచిపోయింది. అయినప్పటికీ వర్షాలు లేకపోవడంతో ఈ ఖరీఫ్‌లో వాణిజ్య పంటలను సాగుచేయలేని పరిస్థితుల్లో పొలాలను బీళ్లుగా వదిలేయాల్సి వచ్చింది. దీనిపై వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వాణిజ్య పంటలను సాగు చేయని రైతులు మొక్కజొన్న, రాగి, ఉలవలు, పొద్దుతిరుగుడు, టమాట సాగును ప్రోత్సహించేలా అధికారులు ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉలవలను అధిక విస్తీర్ణంలో సాగు చేయించాలని వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటికే రాగి, కందులను సరఫరా చేశారు.

సాగు 25.78 శాతమే..

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 82,589 హెక్టార్లలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా. ఇందులో ముతకధాన్యాల పంటలు 2,812 హెక్టార్లకు 1,460, పప్పు ధాన్యాల పంటలు 11,500 హెక్టార్లకు 736, నూనే గింజల పంటలు 48,497 హెక్టార్లకు 12,733 హెక్టార్లలోనే సాగయ్యాయి. వేరుశనగ 47,885 హెక్టార్లలో సాగవుతుందని అంచనా వేయగా వర్షాభావంతో 12,724 హెక్టార్లలోనే సాగైంది. వరి 9,748 హెక్టార్లకు 2,333, సజ్జ 633 హెక్టార్లకు 107, జొన్న 1,657 హెక్టార్లకు 1,271, కందులు 3,671 హెక్టార్లకు 429 హెక్టార్లలో సాగైంది. దీనితో సాగవ్వాల్సిన మొత్తం విస్తీర్ణంలో సాగైంది కేవలం 25.78 శాతం విస్తీర్ణమే. జిల్లాలోని ఆరు మండలాల్లో అత్యల్పంగా పంటలు సాగయ్యాయి. రామాపురం మండలంలో 96, చిన్నమండెం మండలంలో 48, ఓబులవారిపల్లె మండలంలో 43, చిట్వేలి మండలంలో 21, పుల్లంపేట మండలంలో రెండు హెక్టార్లలోనే ఖరీఫ్ పంటలు సాగయ్యాయి.

నిరాశ మిగిల్చిన వర్షం

ఖరీఫ్‌లో జూలై 15లోపు ఖరీఫ్ వేరుశనగ విత్తనం విత్తితేనే మంచి దిగుబడులు వస్తాయి. గడువు తీరాక వర్షం కురిసి పంటలు విత్తినా దిగుబడి ఆశించిన మేరకు ఉండదు. జూన్, జూలై నెలల్లో ఆశించిన వర్షపాతం నమోదు కాలేదు. జూలైలో ఒక మండలంలో సగటుకంటే అత్యధికంగా, ఒక మండలంలో సగటు కంటే అధికంగా, ఏడు మండలాల్లో సగటు, 12 మండలాల్లో లోటు, 9 మండలాల్లో అత్యధిక లోటు వర్షం కురిసింది.

ప్రత్యామ్నాయం సిద్ధం

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టి ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులు సాగుచేయాల్సిన భూములు బీళ్లుగా ఉండటంతో అందులో ఉలవలను అధిక విస్తీర్ణంలో సాగయ్యేలా ప్రణాళిక చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న 23 మండలాల్లోని 45,980.12 హెక్టార్ల విస్తీర్ణంలో ఉలవ సాగు చేయించేందుకు 11,495.03 క్వింటాళ్ల ఉలవలను సరఫరా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. వీటిని రైతులకు 90శాతం రాయితీతో పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో 4కిలోల 700 రాగి కిట్లు, 4,400 కందుల కిట్లను రైతులకు ఉచితంగా సరఫరా చేశారు.

ప్రత్యామ్నయ ఉలవ పంటసాగు వివరాలు

మండలం	ప్రాతిపాదిత విస్తీర్ణం	క్వింటాళ్లు
చిన్నమండెం	735.80	183.95
సంబేపల్లె	2,133	533.25
టి.సుండుపల్లె	957.70	239.43
రాయచోటి	945.40	236.35
రామాపురం	1,700.80	425.20
వీరబల్లి	1,173.20	293.30
గాలివీడు	2,324.68	581.17
లక్కిరెడ్డిపల్లె	2,307.48	576.87
పీలేరు	1,371.80	342.95
పెద్దమండ్యం	2,497.80	624.45
గుర్రంకొండ	1,339.60	334.90
కలకడ	1,381	345.25
కలికిరి	2,095.60	523.90
వాయల్పాడు	2,043.50	510.88
పీటీఎం	5,018.99	1,254.75
కురబలకోట	1,964	491
రామసముద్రం	1,741.87	435.47
కేవీపల్లె	2,946.20	736.55
మదనపల్లె	1,492.50	373.13
ములకలచెరువు	3,657.10	914.28
తంబళ్లపల్లె	2,091	522.75
నిమ్మనపల్లె	1,216.20	304.05
బి.కొత్తకోట	2,844.90	711.23

ప్రత్యామ్నయానికి చర్యలు

జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో ప్రత్యామ్నయ పంటల సాగు కోసం చర్యలు చేపట్టాం. దీనికోసం ఇప్పటికే రైతులకు రాగి, కందులను ఉచితంగా పంపిణీ చేయించాం. ఉలవలు అధిక విస్తీర్ణంలో సాగు చేయించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. ఉలవలు కావాల్సిన రైతులు ధర విలువలో 10శాతం చెల్లించి పొందేలా ప్రభుత్వం సరఫరా చేయనుంది. బీడు భూములు సాగులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నాం. -బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

నందలూరు క్రూ సెంటర్‌ను తరలించొద్దు

రైల్వేబోర్డు చైర్మన్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి వినతి



రైల్వేబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీమిథున్‌రెడ్డి

రాజంపేట: వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో శతాబ్దికాలం నాటి రన్నింగ్ క్రూసెంటర్‌ను తరలించకుండా బలోపేతం చేయాలని రాజంపేట లోక్‌సభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ పీవీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లహోటీని కోరారు. ఈ మేరకు బుధవారం రైల్వేబోర్డు చైర్మన్‌తో ఎంపీ భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వ్యవస్థ ఆవిర్భావకాలంలోనే నందలూరులో రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ కొనసాగిందన్నారు. అన్ని ప్యాసింజర్, గూడ్స్‌రైళ్లకు ఇక్కడే క్రూ సిస్టమ్ కొనసాగిందని గుర్తుచేశారు. మళ్లీ గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల క్రూ సౌకర్యం పునరుద్ధరించాలని విన్నవించారు. వేరే ప్రాంతానికి క్రూసెంటర్‌ను తరలించరాదన్నారు. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఎత్తివేసిన తర్వాత ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పుకొచ్చారు. నందలూరులో వందలాది క్వార్టర్స్, పుష్కలంగా మంచినీటి సౌకర్యం ఉందన్నారు. ఇక్కడ పలు రైళ్లకు వాటరింగ్ సౌకర్యం కల్పించుకోవచ్చునన్నారు. 240 ఎకరాలకుపైగా రైల్వే స్థలాలు ఉన్నాయని, వాటిని ఆదాయవనరుగా మార్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.

- రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, ఓబులవారిపల్లెలో కోవిడ్ ముందు ఏవిధంగా రైళ్ల హాల్టింగ్ కొనసాగిందో, అదే విధంగా హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. బుధవారం రైల్వేమంత్రితో ఎంపీ భేటీఅయ్యారు.

టేక్ హోమ్ రేషన్ పంపిణీ పక్కాగా అమలు చేయాలి

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



లబ్ధిదారులకు రేషన్ అందిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషన్ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 10943 మంది గర్భిణులు, 10039 మంది బాలింతలకు సేవలు అందించాలన్నారు. టేక్ హోమ్ రేషన్‌లో మూడు కిలోల బియ్యం, ఒక కిలో కంది పప్పు, అరకిలో వంటనూనె నెలలో మొదటి శుక్రవారం 13 గుడ్లు, మూడో శుక్రవారం మరో 12 గుడ్లు, పాలు మొదటి శుక్రవారం రెండున్నర లీటర్లు, మూడో శుక్రవారం మరో రెండున్నర లీటర్లు వైఎస్సార్ పోషణ కిట్లలో బెల్లం, వేరుశనగ చిక్కీలు, రాగి పిండి, గోధుమ పిండి, ఎండు ఖర్జూరం, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు కూడా నెలకు 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, రెండు శుక్రవారాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు.ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి రఘురాం, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరామమూరి పాల్గొన్నారు.

ఓపెన్ చాన్స్.. వదలొద్దు



ఈ ఫొటోలో వ్యక్తి పేరు తుపాకుల గురుబాలాజీ. అన్నమయ్య జిల్లా కలకడ మండలం, కదిరాయచెరువు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వివిధ ప్రైవేటు పాఠశాలల్లో చదివి టెన్త్‌లో 6.7 గ్రేడ్ పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాడు. అనంతరం తిరుపతిలో ఓ ప్రైవేటు కాలేజీలో ఎంపీసీ గ్రూపులో ఇంటర్‌లో చేరాడు. అయితే అన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో సొంతగ్రామంలో వ్యవసాయ పనులకు దిగాడు. అయితే చదువుకోవాలనే బలమైన కోరిక ఉండేది. దీంతో ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా మదనపల్లెలోని స్టడీ సెంటర్‌లో చేరాడు. ఎంపీసీ గ్రూపులో ఇంటర్ 59.2 శాతం మార్కులతో పాసయ్యాడు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకలో బీటెక్, ఎంటెక్ (2022) పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఐటీలోని ఓప్ట్రామస్ లాజిక్‌లో సిస్టమ్ ఇంజనీర్‌గా సంవత్సరానికి రూ.5లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాడు. తన ఉన్నతికి కారణమైన ఓపెన్ స్కూల్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాడు.

- టెన్త్, ఇంటర్‌కు నోటిఫికేషన్
- ఇంటి దగ్గర నుంచి చదివే అవకాశం
- సాధారణ కోర్సులతో సమానంగా గుర్తింపు
- అడ్మిషన్లు ప్రారంభం



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ నిర్వహణ

మదనపల్లె సిటీ: గురుబాలాజీ లాగే మధ్యలో చదువును మానేసిన, ఉత్తీర్ణులు కాకపోయిన వారి విద్యాసక్తిని నెరవేర్చేందుకు 'ఓపెన్ స్కూల్' సువర్ణవకాశం కల్పిస్తోంది. 14 ఏళ్ల నుంచి బడి మధ్యలో మానేసిన వారు సార్వత్రిక పాఠశాలలో చేరి 10వ తరగతి చదువుకునేందుకు అవకాశం ఉంది. అంతేకాక ఇంటర్‌లో చేరి చదువుకునే వెసులుబాటుంది. ఇది వరకు ఇంటర్మీడియట్ చదివి అనుత్తీర్ణులైన, మధ్యలో మానేసినవారు కూడా ఈ విధానంలో పూర్తి చేయవచ్చు. మహిళలు, వివిధ వృత్తులు, వ్యాపారరంగంలో ఉన్న వారికి, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ చక్కని మార్గం. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యాక డిగ్రీ, పీజీ తదితర కోర్సులతో పాటు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను చాటుకునే వీలుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని స్టడీ సెంటర్ల ద్వారా ఏటా వేలాది మంది చదువుకునేందుకు అవకాశం కల్పించారు. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీనితో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు అర్హత ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకు అర్హులవుతారు.

దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఆయా అధ్యయన కేంద్రాల్లో కో-ఆర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు.

ఇవీ సబ్జెక్టులు..

పదో తరగతి గ్రూపు-ఏలో ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ, తమిళం, తీసుకోవచ్చు. గ్రూపు-బీలో గణితం, సైన్స్, సోషియల్ తీసుకోవాలి. ఇంటర్‌కు గ్రూపు-ఏలో ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ, తమిళం తీసుకోవచ్చు. గ్రూపు-బీలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

అర్హతలు ఇవీ..

- పదో తరగతి చేరేందుకు ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయో పరిమితి ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేది ధ్రువీకరణపత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కులధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

కాంటాక్టు తరగతులు

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



మధ్యలో బడిమానేసిన వారి సౌకర్యార్థం ఉన్నత విద్య పూర్తి చేసేందుకు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలి.
-పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, రాయచోటి

నేడు డిపార్టుమెంటల్ టెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్‌సీ) ద్వారా ఈనెల 3వ తేదీన ఒక షిఫ్ట్‌లో డిపార్టుమెంటల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ డీఆర్‌ఓ ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. శాఖాపరమైన పరీక్షలు జిల్లాలో 115 మంది రాయనున్నారని డీఆర్‌ఓ తెలిపారు. డిపార్టుమెంటల్ పరీక్షలకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ జారీ చేసినట్లు చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు.ఆలస్యమైతే అనుమతి ఉండదన్నారు. ఒక షిఫ్టులో పరీక్షల నిర్వహణ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని, పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయన్నారు. సెల్‌ఫోన్లు తీసుకుని పరీక్షా కేంద్రంలోకి వచ్చిన వారిని గుర్తిస్తే మాల్ ప్రాక్టీస్ క్రింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాల్ టికెట్‌తోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్షలో ఏపీపీఎస్‌సీ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణాధికారి ఎస్ ఖాసీంవల్లి, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, పోలీస్, ప్రజా రవాణ, మెడికల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. నేతిగుట్టపల్లె గ్రామానికి చెందిన మంజునాథ(30) పుంగనూరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో మంజునాథ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులకు అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారం అందించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె : మండలంలోని సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కదిరప్ప (45) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కిందికి దించి..108కి సమాచారం అందించారు. వారు గ్రామానికి చేరుకుని ఆస్పత్రికి తరలించేందుకు కదిరప్పను పరీక్షించగా, అప్పటికే అయన మృతిచెందారు. జరిగిన ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తాలూకా పోలీసులు తెలిపారు.

భూవివాదం.. వ్యక్తిపై దాడి


గాయపడిన కృష్ణమూర్తి

మదనపల్లె : భూవివాదం కారణంగా ఓ వ్యక్తిపై దాడిచేసిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన జి.కృష్ణమూర్తి(52) కదిరిలో నివాసం ఉంటున్నాడు. అతనికి స్వగ్రామమైన కాండ్లమడుగు క్రాస్‌వద్ద 2.18 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఈక్రమంలో బుధవారం పంట సాగు చేసేందుకు భూమి దున్నుతుండగా, భూ వివాదం కారణంగా అతని అన్న నరసింహులు కొడుకు సుబ్రహ్మణ్యంతో కలిసి వచ్చి కృష్ణమూర్తిపై దాడిచేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారాన్ని బి.కొత్తకోట పోలీసులకు తెలిపారు.

నేటి నుంచి బ్యాడ్మింటన్ సంబరం

- కడప వేదికగా రాష్ట్రస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు


రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరం వేదికగా మరో క్రీడాసంబరానికి తెరలేవనుంది. కడప నగరం పకీర్‌పల్లెలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా వేదికగా ఈనెల 3వ తేదీ గురువారం నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు, వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు అర్హత సాధించేందుకు ఈ టోర్నమెంట్ కీలకమైందని జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. జిలానీబాషా తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథ్‌రెడ్డి సహకారంతో టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు..

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు విచ్చేసి గురువారం ఉదయం టోర్నమెంట్ ప్రారంభించనున్నారు. పోటీలను ఏపీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ద్వారకనాథ్, అంకమ్మచౌదరి, నేషనల్ రెఫరీ రామకృష్ణ పర్యవేక్షిస్తారని జిలానీబాషా తెలిపారు. గురువారం నిర్వహించనున్న టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు స్టేడియంలో సాధన చేశారు. కాగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నేషనల్ రెఫరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణదారులపై కేసులు

జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్


మాట్లాడుతున్న దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

రాజంపేట టౌన్ : జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న దేవాలయాల భూములను ఆక్రమించిన వారిపై నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసినట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. రాజంపేటలోని దేవదాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దేవదాయశాఖ భూములను ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. తాము ఇచ్చిన నోటీసులకు ఆక్రమణదారులు 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని అలా ఇవ్వనివారిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుశాఖచే నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. దేవదాయశాఖకు చెందిన భూములకు సంబంధించిన వివరాలపై ప్రతినెల సమీక్షించేందుకు పదకొండు మంది జిల్లా అధికారులతో కూడిన కమిటీని కూడా ప్రభుత్వం నియమించిందని వెల్లడించారు. సెక్షన్ 22ఏ-1సీ చట్టం కింద నమోదు అయిన దేవాలయాల భూముల వివరాలను, దేవాదాయశాఖ రిజిస్టర్లు, మీఇంటికి మీ భూమి వివరాలతో సరిపోల్చుకొని దేవాదాయశాఖ వెబ్‌లింక్ కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. 6సీ దేవాలయాల్లో పనిచేసే వంశపారంపర్య హక్కులు కలిగి, 43 ప్రాపర్టీ రిజిస్టర్‌లో నమోదు అయిన అర్చకులు తమ వంశీకుల పేర్లను జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో తెలియచేయాలన్నారు. దేవదాయశాఖ పరిధిలోని దేవాలయాల్లో పనిచేసే అర్చకులు ఎన్నేళ్లయినా అర్చకత్వాన్ని చేసుకోవచ్చని పునరుద్ఘాటించారు. ఈనెల 4వ తేదీ కడపలోని రాజరాజేశ్వరి ఆలయంలో జిల్లాలోని ఆలయాల చైర్మన్లకు, ధర్మకర్తల మండలి సభ్యులకు స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ గుంటూరువారిచే శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ కొండారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి


మంజునాథ (ఫైల్)

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డి గారిపల్లెకు చెందిన బండిమంజునాథ(32) పట్టణంలోని ఐటీసీ సిగరెట్ల కంపెనీ గోడౌన్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వ్యాపార కలెక్షన్లలో భాగంగా మంగళవారం కర్నాటకలోని రాయల్పాడు మండలం గెల్లిగూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. పనిముగించుకుని తిరిగి మదనపల్లెకు వస్తున్న క్రమంలో గెల్లిగూరు సమీపంలో మంజునాథ వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొంది ప్రమాదంలో మంజునాథకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య పూర్ణిమ, కొడుకు దేవేశ్వర్ ఉన్నారు.

పొలానికి నీరు ఇవ్వలేదని రైతు ఆత్మహత్యాయత్నం


రామయ్య

మదనపల్లె : సాగుచేస్తున్న పొలానికి అన్నదమ్ములు నీరు ఇవ్వడం లేదని మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. గొల్లపల్లెకు చెందిన తిమ్మప్ప కుమారుడు రామయ్య(40)కు మరో ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. ఉమ్మడి వ్యవసాయ పొలంలో రామయ్య వరిపంట సాగుచేశాడు. అన్నదమ్ముల మధ్య భూవివాదాల కారణంగా వరి పొలానికి నీరివ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో మనస్తాపం చెందిన రామయ్య బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారాన్ని వాల్మీకిపురం పోలీసులకు తెలిపారు.

టీడీపీ నాయకుడి మోసం


ప్రభుత్వ స్థలంలో ఉన్న సెల్‌టవర్

పీలేరు : ప్రభుత్వ భూమిని తనదిగా నమ్మించి ఓ సెల్ టవర్ కంపెనీ నుంచి సుమారు ఆరేళ్లుగా అద్దె వసూలు చేస్తున్న ఓ టీడీపీ నాయకుడి భాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ సర్వే నెంబరు 562/16 ప్రభుత్వ భూమిలో ఆరేళ్ల క్రితం జియో సెల్ టవర్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అమరనాథరెడ్డి ప్రభుత్వ భూమికి పక్కనే ఉన్న తన సొంత భూమి రికార్డులు చూపి జియో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే సెలటవర్‌ను ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేపించి ప్రతి నెలా సుమారు రూ. 8 వేలు అర్జిస్తున్నాడు. ఇటీవల ఈ విషయం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ దృష్టికి వెళ్లడంతో ఆయన పరిశీలించి నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పాముకాటుతో విద్యార్థి మృతి


బి.యువరాజు (ఫైల్)

ములకలచెరువు : పాముకాటుతో విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ తంబళ్లవారిపల్లెకు చెందిన బి.చంద్రశేఖర్ కుమారుడు బి.యువరాజు (15) ఇంటి ఆవరణంలో మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయాడు. పక్కనే ఉన్న చెట్ల పొదల్లో నుంచి వచ్చిన పాము కాటు వేసింది. దీనితో అస్వస్థతకు గురయ్యాడు. ఉదయం ఎంతసేపటికి యువరాజ్ నిద్ర లేవకపోవడంతో గమనించిన తండ్రి లేపించాడు. విద్యార్థి పక్కలోనే పాము ఉండడాన్ని చూసి చంపేశారు. అప్పటికే తీవ్ర అస్వస్థతో ఉన్న బిడ్డను చూసి పాముకాటు వేసినట్లు గుర్తించి ములకలచెరువు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పెటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం


అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆగిపోయిన బస్సు


బస్సుకు డీజిల్ పడుతున్న దృశ్యం

- కడప-బీహెచ్‌ఈఎల్ సర్వీస్ షాద్‌నగర్ వద్ద బ్రేక్
- డీజిల్ లేక ఆగిపోయిన బస్సు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నుంచి హైదరాబాదు మీదుగా బీహెచ్‌ఈఎల్ (6031) సర్వీసు మంగళవారం రాత్రి 8.40 గంటలకు కడప నుంచి బయలుదేరింది. బస్సు గ్యారేజీలో నుంచి బయటికి వచ్చినపుడు గ్యారేజ్ సిబ్బంది ఫిట్‌నెస్ కరెక్టుగా ఉందని పంపించారు. ఇక బస్సులోని డ్రైవర్లు బస్సు తీసుకుని బయలుదేరారు. కర్నూలు, జడ్చర్ల దాటిన తర్వాత 3.40 గంటలకు షాద్‌నగర్‌కు 16 కిలోమీటర్ల దూరంలో ఓ పెట్రోలు బంకు సమీపంలో బస్సు నిలిచిపోయింది. తీరా చూసుకుంటే బస్సులో డీజల్ పట్టలేదని డ్రైవర్లు నిర్ధారించుకున్నారు. అర్ధరాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో ఏ బస్సులు కూడా నిలబడలేదు. చివరికి టికెట్ల ద్వారా వచ్చిన నగదుతో పాటు ఓ ప్రయాణికుడి వద్ద కొంచెం డబ్బులు తీసుకుని బస్సు గమ్య స్థానానికి చేరేలా సమీపంలోని పెట్రోలు బంకు వద్ద డీజల్ పట్టించుకున్నారు. దాదాపు గంటకుపైగా బస్సు నిలబడి పోయింది. విషయం తెలిసిన ప్రయాణికులు అధికారులు తీరుపై మండిపడ్డారు. కాగా బస్సు దాదాపు ఉదయం 9 గంటలకు బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంది. ఇలాంటి ఘటనలు గతంలో కడప డిపోలో విజయవాడ, బెంగుళూరు, హైదరాబాదు సర్వీసులకు కూడా ఎదురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు బస్సులు బయటికి పంపేటపుడు అన్ని విధాల పరిశీలించి బస్సులను పంపించాలని ప్రయాణికులు సూచించారు.

వాస్తవం ఉన్న వార్తలకే విలువ

కొమ్మినేని శ్రీనివాసరావు


రిషివ్యాలీ స్కూల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు

కురబలకోట : వార్తలు వాస్తవాలను ప్రతిబింబింపజేసేలా ఉండాలని అప్పుడే ప్రజలకు మీడియాపై నమ్మకం విలువ ఉంటుందని ఏపీ ప్రెస్‌క్లబ్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రిషివ్యాలీ స్కూల్‌ను బుధవారం సాయంత్రం కొమ్మినేని సందర్శించారు. స్కూల్ నిర్వాహకులతో మాట్లాడారు. పరిసరాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన హార్సిలీహిల్స్ వెళుతూ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిరాధార వార్తలను ప్రచురించడం ఆపై ప్రసారం చేయడం ప్రజలను పక్కదారి పట్టించడమే అవుతుందన్నారు. ఇది జర్నలిస్టుల విలువలకు కూడా వ్యతిరేకమన్నారు. ప్రభుత్వం లోపాలను ఎత్తి చూపడంలో తప్పులేదని అయితే లేనిపోని కల్పిత వార్తలు, కట్టు కథలు సరికాదన్నారు. రిషివ్యాలీ వచ్చిన సందర్భంగా స్థానిక తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు ఆయనకు సాదర స్వాగతం పలికారు.

పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవలు మహనీయులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఉదయప్రకాష్‌రెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ లైబ్రరీలో..

కడప కల్చరల్ : భారతదేశం జాతీయ పతాకాన్ని రూపొందించి అజరామర కీర్తి పొందిన దేశభక్తుడు పింగళి వెంకయ్య అని, నాటకరంగంలో రారాజుగా పేరుగాంచిన బళ్లారి రాఘవ మహానటుడని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బళ్లారి రాఘవయ్య ,పింగళి వెంకయ్య జయంతులను కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారిద్దరి చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్

సెంట్రల్ జోన్ జట్టుకు ఆధిక్యం


తలపడుతున్న సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్ జట్లు


102 పరుగులు చేసిన తౌఫిక్


5 వికెట్లు తీసిన అచ్యుత్ హేమంత్‌కుమార్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల జోన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. సెంట్రల్‌జోన్, నార్త్‌జోన్ జట్ల మధ్య నిర్వహిస్తున్న మ్యాచ్‌లో మూడోరోజు బుధవారం 170 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 129.2 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 481 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.కె. తౌఫిక్ 102 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ అచ్యుత్ హేమంత్‌కుమార్ 5 వికెట్లు తీశాడు. మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ జట్టు 457 పరుగులు చేయగా, సెంట్రల్‌జోన్ జట్టు 481 పరుగులు చేసింది. దీంతో సెంట్రల్ జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 24 పరుగుల ఆధిక్యం లభించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న ఖాజాపీర్

మైదుకూరు : పట్టణంలోని మైదుకూరు-వనిపెంట రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మైదుకూరుకు చెందిన షేక్ ఖాజాపీర్, వీరయ్య అనే వారు స్థానిక వనిపెంట రోడ్డులోని ఎర్రచెరువు సమీపంలో ఉన్న ఓ మెకానిక్ షెడ్ వద్దకు వెళ్లి మంగళవారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వనిపెంట వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొంది. సంఘటనలో ఖాజా పీర్, వీరయ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరికి మైదుకూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కడపకు తరలించారు. ఖాజా పీర్ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణపై పాలకులకు చిత్తశుద్ధి కరువు


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణపై ప్రకటనల్లో కాదని చేతల్లో చూపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. హింసపై మహిళల పోరు యాత్రలో భాగంగా బస్సు యాత్ర బుధవారం రాత్రి ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా పుట్టపర్తి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ బిలికిస్ భానోను పలువురు అత్యాచారం చేస్తే ఆమె ధైర్యంగా పోరాడిందన్నారు. ఫలితంగా నేరస్తులకు శిక్ష పడిందని, ఇప్పటి పాలకుల వివక్షత కారణంగా నేరస్తులను బయటకు వదిలేశారన్నారు. మణిపూర్ సంఘటనలో ప్రధాని సిగ్గుపడటం మనకు అవసరం లేదని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ మహిళల అత్యాచారాల్లో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాట ఇచ్చిన మేరకు మద్య నిషేధం చేయాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన ఒక బిక్షగత్తెపై సామూహిక అత్యాచారం జరిగితే ఇక్కడి మహిళా సంఘం బాధితురాలికి అండగా నిలిచిందన్నారు. ఈనెల 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభకు మహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు సావిత్రి, జిల్లా కార్యదర్శి ఎస్.ముంతాజ్ బేగం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న దామోదర్‌రావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్‌రావు అన్నారు. బుధవారం కడప నగరంలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బోస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం తర్వాత కార్మికులు ఏపీపీటీడీ ఉద్యోగులుగా మారారన్నారు. ఆ తర్వాత 11వ పీఆర్సీ అమలు జరిగిన అనంతరం క్యాడర్ల వారీగా వచ్చిన ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు ఉద్యోగ సంఘాల సమావేశంలో హామీ ఇచ్చారన్నారు. త్వరలో ఈ క్యాడర్ల వారీగా ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తామని, ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీ పీటీడీ ఉద్యోగులకు పెండింలో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సెప్టెంబరు నెలాఖరులోగా చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, కడప జోనల్ అధ్యక్షులు కేకే కుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు అంకిరెడ్డి, రంగనాథ్, ప్రమీల, పీవీ నారాయణ, పీఎస్‌పీ రెడ్డి, పద్మనాభరెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునతోపాటు జిల్లాలోని అన్ని డిపో, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఇటీవల బస్సు ప్రమాదంలో గాయపడిన డిపో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ బాల వెంకటేశ్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ముగ్గురి సస్పెన్షన్

- ఒక హెడ్‌టీచర్‌తోపాటు ఎస్ఎస్ఏ ఇంజనీరు, సచివాలయ గ్రేడ్-2 ఇంజినీరు

కడప ఎడ్యుకేషన్ : చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లె ఉర్దూ ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల స్కూల్ గేట్ మీదపడి విద్యార్థి మృతి చెందిన సంఘటనలో ముగ్గుర్ని సస్పెండ్ చేస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పాఠశాల హెడ్ టీచర్‌తోపాటు పీఆర్ ఇంజనీరు, ఇప్పెంట సచివాలయంలో గ్రేడ్-2గా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా ఉన్నారు. బోడెద్దులపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు పనుల్లో భాగంగా పాఠశాలకు ప్రధాన ద్వారానికి గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ గేటును సరిగా ఏర్పాటు చేయని కారణంగా మూడు రోజుల క్రితం అదే పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ అయూమ్ మీద పడింది. తీవ్రగాయాల పాలై తిరుపతిలో చికిత్స పొందుతూ ఆ బాలిక బుధవారం మృతి చెందింది. ఇందుకుగాను ఆ పాఠశాలలో గతంలో హెడ్ టీచర్‌గా పనిచేసిన నజీర్‌ను (ప్రస్తుతం ఆయన మైదుకూరు ఉర్దూ స్కూల్లో పనిచేస్తున్నారు) డీఈఓ రాఘవరెడ్డి సస్పెండ్ చేశారు. అలాగే సమగ్రశిక్ష ఇంజనీర్‌గా పనిచేస్తున్న గుప్తాను, ఇప్పెంట్ సచివాలయంలో గ్రేడ్-2 ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకళను పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి సస్పెండ్ చేశారు.